సీఎం జగన్‌తోనే సుస్థిర పాలన



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' బుక్‌లెట్‌లతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

ఆనందపురం : రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరలా ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు సుస్థిర పాలన అందుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం మండలంలోని గిడిజాల, కణమాంలో గురువారం నిర్వహించారు. అనంతరం కణమాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది అనుభవజ్ఞులైన నేతలున్నా వారంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనను అనుసరించడం గొప్ప విషయమన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకొని వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచే విధంగా పథకాలు అమలు చేస్తున్న జగన్‌నే మరలా గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ఏ కష్టం వచ్చినా, ప్రభుత్వ పథకాలు పొందాలన్నా స్థానికంగానే పరిష్కారం దొరికే విధంగా సేవలు అందిస్తున్న సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో పెను మార్పులు తీసుకొచ్చి, ఎక్కడా సేవలకు ఆటంకం కలగకుండా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. పొరపాటున ప్రతిపక్షాలకు అవకాశమిస్తే మరలా రాష్ట్ర సంపద దోపిడీకి గురై దివాలా తీస్తుందనే విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ఈ సందర్భంగా కణమాంలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించి, రూ.1.19 కోట్లతో నిర్మించనున్న మంచినీటి పథకానికి శంకుస్థాపన చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రింకి శ్రీను, సర్పంచ్ షిణగం అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు గొలగాని కృష్ణ, గుసిడి ముత్యాలు, నాయకులు కోరాడ ముసిలినాయుడు, పినిశెట్టి సింహాచలం నాయుడు, యర్ర అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి

కొమ్మాది: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం సుభాష్‌నగర్ 85వ నంబరు సచివాలయం వద్ద గురువారం నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డు, వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అలాంటి పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, మాదు చంటి, బుజ్జి, మద్దాల వెంకటరావు, గుంట బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు, తదితరులు

క్లుప్తంగా

జాతీయ పోటీలకు రమేష్



భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి జాతీయ క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికయ్యాడు. బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వంతల రమేష్ ఇటీవల అరకులో ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహించిన పది కిలోమీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి... జాతీయ అంతర్ విశ్వవిద్యాలయాల క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో నాందేడ్‌లో జరిగే పోటీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపున పాల్గొంటాడు. ఈ మేరకు కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల, ఇతర అధ్యాపకులు గురువారం అభినందించారు.

గీతంలో పరిశోధన కేంద్రాలు

కొమ్మాది: బోధనతోపాటు పరిశోధనలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ గీతం డీమ్డ్ విశ్వ విద్యాలయంలో రూ.100 కోట్లతో పరిశోధన కేంద్రాలు అభివృద్ధి చేస్తున్నామని వీసీ దయానంద సిద్ధవట్టం తెలిపారు. తద్వారా శాస్త్ర విజ్ఞానంలో దేశంలో గర్వించదగ్గ అత్యున్నత పరిశోధనలు నిర్వహించాలనేది తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. గీతంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 'గీతం కెమిస్ట్రీ రీసెర్చ్ కాన్ఫరెన్స్ – 2023' ఆయన ప్రారంభించారు. ఇంజినీరింగ్, సైన్స్, ఫార్మసీ, వైద్య విభాగాల అనుసంధానంతో అంతర్విభాగ పరిశోధనలపై తాము దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. రసాయన శాస్త్రవేత్తలు, పరిశోధకులు పర్యావరణహితం కోరే విధంగా ఉత్పత్తులు అందించాలని సూచించారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఆనందపురం : పేదలు కోసం కేంద్రం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ భీమిలి నియోజకవర్గ కన్వీనర్ కంటుభుక్త రామానాయుడు కోరారు. మండలంలోని కుసులువాడ సచివాలయ పరిధిలో గురువారం వికసిత్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సరఫరా ఏర్పాటు కోసం కేంద్రం నిధులు అందిస్తోందని చెప్పారు. అనంతరం ఆయుష్మాన్ ఆరోగ్య కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. ఉజ్వల పథకం కింద పలువురికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి జీవనలత, బీజేపీ జిల్లా కార్యదర్శి బండారు అనిల్ కుమార్, పీవీవీ ప్రసాదరావు, నాయకులు పిల్లా చిన్నారావు, నిమ్మకాయల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలపై ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

తగరపువలస: భీమిలి టౌన్ ప్లానింగ్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది గురువారం తగరపువలసలోని రాములమ్మ థియేటర్ పరిసరాల్లో డ్రైనేజీలపై ఆక్రమణలు తొలగించారు. వర్షం నీటి ప్రవాహానికి ఆటంకం కలిగిస్తూ చేపట్టిన నిర్మాణాలు తొలగించడమే కాకుండా ఆక్రమణదారులకు జరిమానా విధించారు. తొలగింపులో శానిటేషన్ సిబ్బంది కూడా పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో పెను ప్రమాదం తప్పింది. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలుల ప్రభావంతో బుధవారం అర్ధరాత్రి ఇక్కడి పార్కు సమీపంలో ఉన్న ఓ భారీ చెట్టు నేలకొరిగింది. ఇది ఓ ఇంటిపై పడింది. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

శాడిస్ట్ భర్తకు నాలుగు నెలల జైలు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు కార్మికవాడకు చెందిన కాపు మోహన్‌రావు అనే వ్యక్తికి భీమిలి 15వ అదనపు మేజిస్ట్రేట్ నాలుగు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్టు భీమిలి సీఐ డి.రమేష్ గురువారం తెలిపారు. 2019లో మోహన్‌రావు తనను శారీరంగా, మానసికంగా హింసించినట్టు భార్య పావని భీమిలి పోలీసుకు ఫిర్యాదు చేసింది. పెంకుతో తలపై కొట్టడంతో అప్పట్లో ఆమె తీవ్రంగా గాయపడింది. హెచ్‌సీ కాంతారావు దర్యాప్తు చేసి వివరాలు న్యాయమూర్తి ముందు వుంచడంతో ఆమె పైవిధంగా తీర్పు చెప్పారు. పావనికి భర్త మోహన్‌రావు రూ.2వేలు నష్టపరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.

పింఛన్ నగదు చోరీపై విచారణకు వినతి



జెడ్సీ కనకమహాలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న 41వ నంబరు సచివాలయ పరిధి వలంటీర్లు

మధురవాడ: గత నెల 30న జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం 41వ నంబరు సచివాలయంలో రూ.49,750 పింఛన్ నగదు చోరీపై సమగ్ర విచారణ చేపట్టాలని వలంటీర్లు కోరారు. ఈ విషయమై వెల్ఫేర్ సెక్రటరీ అన్నపూర్ణతోపాటు జీవీఎంసీ మధురవాడ జోన్ సూపరింటెండెంట్ అప్పలరాజు జెడ్సీ ఆదేశాలతో పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ సాగుతుండగా గురువారం వలంటీర్లు మధురవాడ జోనల్ కార్యాలయానికి వచ్చి జెడ్సీ కనక మహాలక్ష్మిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నాలుగున్నరేళ్లుగా ఇక్కడ పనిచేస్తూ పింఛన్ సొమ్ము సచివాలయం నుంచి తీసుకెళ్లి లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. ఎన్నడూ ఇలా జరగలేదని, ఒక సెక్రటరీ నిర్లక్ష్యం వల్ల అందరికీ చెడ్డ పేరు వస్తోందన్నారు. ఈ వ్యవహారంపై మరింత లోతుగా విచారణ చేయించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జెడ్సీని కోరారు.

మందుబాబులకు జరిమానా, సేవా శిక్ష

ఆనందపురం : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి భీమిలి న్యాయస్థానం జరిమానా, సామాజిక సేవ శిక్ష విధించారని ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 65 మందిని భీమిలి 15వ అదనపు మెట్రో పాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు గురువారం హాజరు పరిచారు. ఈ మేరకు న్యాయమూర్తి జి.విజయలక్ష్మి ఒక్కొక్కరికి రూ.వేయి చొప్పున జరిమానాతోపాటు సామాజిక సేవ కింద పరిసరాలను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు వారు ఏఎంజీ పాఠశాలలో, ఇండోర్ స్టేడియంలో చెత్త తొలగించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కృష్ణాపురంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తులసి లక్ష్మి, తదితరులు

పద్మనాభం: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాపురం సర్పంచ్ మొకర తులసి లక్ష్మి సూచించారు. మండలంలోని కృష్ణాపురం సచివాలయం వద్ద గురువారం సాయంత్రం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం తులసి లక్ష్మి మాట్లాడుతూ ఏ గ్రేడ్ రకం సోనా, సాంబ మసూరి వంద కిలోలు రూ.2203, బి గ్రేడు రకాలకు రూ.2183 మద్దతు ధర ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు మొకర అప్పలనాయుడు, బొలె అప్పలనాయుడు, గాడు అప్పలరాజు పాల్గొన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలన



కొండపేటలో పైప్‌లైన్ మరమ్మతుల కోసం తీసిన గోతిలో వర్షం నీటిని పరిశీలిస్తున్న జెడ్సీ రాము

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గురువారం ఉదయం జెడ్సీ బి.రాము పర్యటించారు. ముందుగా సంగివలస ఫ్లై ఓవర్ వద్ద సర్వీస్‌రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలించారు. ఆ నీటిని చెరువులోకి, అక్కడి నుంచి పొలాల్లోకి విడుదల కాకుండా రైతులు అడ్డుకుంటున్నారన్నారు. రోజుల తరబడి సర్వీస్‌రోడ్డుపై వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రమాదాలు జరుగుతాయేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇదే ఫ్లై ఓవర్ వద్ద సర్వీస్‌రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయిన ప్రదేశంలో ప్రమాదాలు జరిగినట్టు గుర్తు చేశారు. ఈ సందర్భంగా నేషనల్ హైవే అధికారులు, భీమిలి సీఐ డి.రమేష్‌కు సమాచారం అందించారు. అనంతరం కొండపేట పంప్‌హౌస్‌కు సమీపంలో పైప్‌లైన్ మరమ్మతుల కోసం తీసిన గొయ్యిని పరిశీలించారు. ఈ ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టాలని తాగునీటి సరఫరా సిబ్బందికి సూచించారు. కొండపేట ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా ఉన్న డాక్టర్ అంబేడ్కర్ భవనాన్ని కూల్చివేయాలన్నారు. ఇక్కడ సామాజిక భవనం, పంప్‌హౌస్ వద్ద కొండవాలులో రక్షణగోడ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీలపై శిథిలమైన చోట సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలన్నారు. పలుచోట్ల లీకవుతున్న పైపులను సరిచేయాలన్నారు. ఆయనతో పాటు పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, మాజీ కౌన్సిలర్ ఉప్పాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా సామగ్రి పంపిణీ



చంద్రంపాలెం హైస్కూల్‌లో క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంఈవో అనురాధ

మధురవాడ: 'ఆడుదాం ఆంధ్రా' టోర్నమెంట్‌కు అవసరమైన క్రీడా సామగ్రిని ఆయా సచివాలయాలకు పంపిణీకి గురువారం శ్రీకారం చుట్టారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మండల స్థాయి స్టాక్ పాయింట్ నుంచి 95 వార్డు సచివాలయాలకు కిట్లు, సామగ్రి పంపిణీని మండల విద్యాశాఖ అధికారి పి.అనురాధ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి 8 రకాల క్రీడా పరికరాలతో కిట్లు అందజేస్తున్నామన్నారు. విద్యార్థులంతా క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించాలని కోరారు. చంద్రంపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం.రాజబాబు, పీడీలు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు సంబంధించిన పరికరాలను ఎంఈవో పద్మావతి సచివాలయ సిబ్బందికి గురువారం అందజేశారు. మండలంలో 18 సచివాలయాలు ఉన్నాయి. క్రికెట్, వాలీబాల్ పోటీలను ముందుగా సచివాలయ స్థాయిలో ఈ నెల 17 నుంచి 20 వరకూ నిర్వహించనున్నారు. అనంతరం ఈ నెల 21 నుంచి 24 వరకూ మండల స్థాయి పోటీలు నిర్వహిస్తారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని సచివాలయాల్లో క్రీడాకారుల నమోదు చురుగ్గా జరుగుతోంది.

రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలి



దాకమర్రిలో వరి చేనును పరిశీలిస్తున్న ఎంపీపీ వాసురాజు, తదితరులు



విలాస్కాన్‌పాలెంలో వరి పనలు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి

పద్మనాభం: రైతులు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి సూచించారు. మండలంలోని కోరాడ, రేవిడి, విలాస్కాన్‌పాలెం గ్రామాల్లో తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి పంటను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ తడిచిన వరి పనలు మొలకలు రాకుండా ఐదు కిలోల ఉప్పును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. మడిలో నీరు నిల్వ లేకుండా వెలుపలకు పంపించాలన్నారు. ఏడీ సీహెచ్.సుబ్రహ్మణ్యం, ఏవో ఎంవీఎస్ చలం, ఏఈవో శ్రీనివాసరావు ఉన్నారు.

నీట మునిగిన పంట పొలాల పరిశీలన

తగరపువలస: తుపాను ప్రభావంతో భీమిలి మండలంలో నష్టపోయిన పంట పొలాలను ఎంపీపీ దంతులూరి వాసురాజు గురువారం పరిశీలించారు. రైతులను కలిసి జరిగిన పంట నష్టం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలు తగ్గినందున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయ అధికారులు వివరించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, పొట్నూరు చంద్రశేఖర్, సచివాలయ కన్వీనర్ రాజగిరి రామచంద్రరావు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నసంతర్పణ



అన్నసంతర్పణ చేస్తున్న మాలధారులు

పద్మనాభం: మండలంలోని మద్ది గ్రామంలో గల శ్రీ ధర్మ శాస్త్ర సేవా పీఠం వద్ద గురువారం అన్నసంతర్పణకు ఆనందపురం మండలం బోని గ్రామానికి చెందిన బోని సన్యాసినాయుడు ఆర్థిక సహకారం అందజేశారు. సుమారు మూడు వందల మంది మాలధారులు అన్నప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, బోని నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తగరపువలస: గుంటూరు జిల్లా బాపట్లలో ఈ నెల 9, 10, 11న జరగనున్న రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు స్థానిక బ్యాంకు కాలనీలోని విద్యాసాగర్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 3న చిట్టివలస హైస్కూల్ మైదానంలో జరిగిన జిల్లా స్థాయి అండర్ – 19 షూటింగ్‌బాల్ పోటీల్లో కె.హారిక, పి.రోహిణి, వి.సాయిసంపత్, ఎస్.రామచరణ్ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. విద్యార్థులతోపాటు పీఈటీ దినేష్‌ను కరస్పాండెంట్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ కె.శాంత, డైరెక్టర్ కె.ఎల్.నరసింహమూర్తి తదితరులు గురువారం అభినందించారు.

భీమునిపట్నం: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు కీతిన్‌పేట సన్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల విశాఖ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో పదో తరగతి చదువుతున్న ఎస్.నీహారిక, ఎల్.యషిక, డి.యశోద, వి.జ్యోతిస్వరూప్, ఎస్.మనోజ్‌కుమార్, జి.శ్రీరామ్, 9వ తరగతి చదువుతున్న జె.జాహ్నవి ఎంపికయ్యారు. వీరిని గురువారం పాఠశాల డైరెక్టర్ కైపతల్లి శ్రీనివాసరావు అభినందించారు.

చి'వరి'కి కన్నీరే మిగిలింది



ఏనుగులపాలెంలో నేలకొరిగిన వరి గింజలకు మొలకలు వచ్చిన దృశ్యం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వల్ల వరి పంట నేలకొరిగి ధాన్యం మొలకలు వచ్చాయి. దీంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షార్పణం కావడంతో అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. మద్ది గ్రామంలో చోడి నారు నాశనమైంది. ఇదే గ్రామంలో బుగత అప్పలనాయుడు ఇంటి కోసం ముందుగా నిర్మించిన రక్షణ గోడ శిథిలమైంది.

సంగివలస చెరువు కింద మట్టి తరలింపు



సంగివలస చెరువు కింద సత్యకల్యాణ్ లే అవుట్ వైపు తొలగించిన మట్టి

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంగివలస చెరువు కింద బంజరులో మట్టిని స్థానికులు తరలించుకుపోతున్నారు. సత్యకల్యాణ్ లే అవుట్ వైపు చెరువు ముఖద్వారంలో గొయ్యి తవ్వి లారీలు, ట్రాక్టర్లతో మట్టిని తరలించారు. ఇటీవల ఈ చెరువు చుట్టూ డ్రైనేజీ నిర్మాణానికి జీవీఎంసీ అధికారులు తాత్కాలికంగా తవ్విన కాలువను ఆనుకుని పెద్ద మొత్తంలో మట్టిని సంగివలస – పాండ్రంగి రహదారి వద్దకు తరలించి నిల్వ చేశారు. ఇలా మట్టిని తవ్వేయడం వల్ల తాత్కాలికంగా తవ్విన కాలువ కుంగిపోవడమే కాకుండా చెరువు కట్టపై నిర్మించిన వాకింగ్ ట్రాక్‌కు కూడా ప్రమాదం పొంచి ఉందని సంగివలస వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మట్టి తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.